# బ్లూ బెల్స్

-కె. ప్రవీణరెడ్డి

గాఢ నిద్రలో ఉన్న పల్లవికి తననెవరో చేత్తో తట్టినట్లుగా అన్పించడంతో మెలుకువ వచ్చింది. నిద్ర బరువుతో మూసుకుపోతున్న కళ్ళను బలవంతంగా తెరుస్తూ ఓసారి గదంతా కలియజూసింది. నీలం రంగు బెడ్ లైట్ కాంతి పల్చగా పరుచుకొని ఉంది. పక్కన ఆమె భర్త వివేక్ మంచి నిద్రలో ఉన్నాడు.

తనను తట్టిందెవరు?...

తన మెడపైన ఎవరో తట్టినట్టుగా అన్పించింది. ఆ స్పర్శ ఇంకా అలాగే ఉంది. అసంకల్పితంగా పల్లవి చెయ్యి మెడపైకి వెళ్ళింది. మెడని నిమురుకుంటూ ఓ క్షణం ఆలోచించింది... ఎవరై ఉంటారూ...? తన భ్రాంతేమో...? అనుకుంటూ మంచంపై ఒరిగింది. మెడ వరకూ దుప్పటి కప్పుకొని నిద్రలోకి జారుకుంది. కాసేపటికి మళ్ళీ అదే ఫీలింగ్ కలిగిందామెకు (మెడపైన ఎవరో తట్టినట్లుగా...) ఒక్క ఉదుటున లేచి కూర్చుంది. ఈసారి ఆమెను భయం ఆవహించింది. మెడపై చెయ్యుంచుకొని అలాగే ఆలోచిస్తూ కాసేపు కూర్చుండిపోయింది. కళ్ళ మీదికి నిద్ర తన్నుకు రావడంతో మళ్ళీ మంచంపైకి ఒరిగింది. కానీ ఈసారి ఆమె నిద్రని పారద్రోలే ప్రయత్నం చేయసాగింది. అందులో భాగంగా ఆమె తన భర్త వైపొకసారి చూసింది. బెడ్ లైట్ కాంతిలో తీర్చిదిద్దినట్లున్న వివేక్ ముఖం చూచిన కొద్దీ చూడాలన్పిస్తుంది. ఒత్తైన అతని కనుబొమలు రెండూ కలిసిపోయి ఆ ముఖానికి వింతైన ఆకర్షణ తెచ్చిపెట్టాయి. కోటేరు లాంటి ముక్కు అతని ముక్కుసూటితనాన్ని తెలుపుతున్నట్లుగా ఉంది. పెదాలపై నిద్రలో కూడా చెరగని చిరునవ్వుతో ఉన్న అతన్ని చూస్తుంటే మనసుకు ఆహ్లాదంగా (వుంది అన్పిస్తుంది). వివేక్ శరీరాకృతి బాగా చెయ్యి తిరిగిన శిల్పి అత్యంత శ్రద్ధతో చెక్కినట్లుగా ఉంది. పల్లవి అతని విశాలమైన నుదుటిని అంటీ అంటనట్లుగా తన పెదాలతో స్పృశించింది. తమ పెళ్ళయ్యి సరిగ్గా నెల అవుతూంది. ఈ నెల రోజుల అతని సాహచర్యం తనకెంతో నచ్చింది. హనీమూన్‌కి గోవా వచ్చారు. వివేక్ కులూమనాలీ వెళ్దామన్నాడు. కానీ తన కోరిక మేరకు గోవా రావడానికి ఒప్పుకున్నాడు. పెద్దలు కుదిర్చిన వివాహమైనా తన భావాలను అర్థం చేసుకునే భర్త దొరకడం నిజంగా తన అదృష్టం. గోవా రాజధాని అయిన పాంజిమ్ (పనాజి)లో ముందుగా రిజర్వ్ చేసుకున్న హోటల్ లీలా గ్రూప్ వారి రిసార్ట్స్‌లో బీచ్‌వ్యూ ఉన్న కాటేజీలో ఉంటున్నారు. నిన్నంతా డోనా పావ్ బీచ్‌లో గడిపారు. బీచ్‌కి ఓ వైపున ఉన్న చిన్న చిన్న షాపుల్లో మెత్తని నూలు వస్త్రంతో కుట్టి ఉన్న రెండు 'లాంగ్ ఫ్రాక్'లు (పొడుగ్గా మోకాళ్ళ కింది వరకు వేసుకునే గౌనులు) కొనుక్కుంది. ఎలీజా మేడమ్ ఎప్పుడూ అలాంటి దుస్తులే వేసుకునేది. తనకలాంటివి కుట్టించమని అమ్మని అడిగితే ఎప్పుడూ కుట్టించేది కాదు. లాంగ్ ఫ్రాక్ వేసుకోవాలన్న తన కోరిక ఇన్నాళ్ళకు తీరింది అనుకుంది పల్లవి తన ఒంటిపైన నీలి రంగు చుక్కల ప్రింటు ఉన్న తెల్లని గౌను వంక చూసుకుంటూ.

నిజానికి ఎలీజా మేడమ్ చెప్పిన కబుర్లే తనలో గోవా వెళ్ళాలన్న కోరికను కలిగించాయి. గోవా రాజధాని పనాజి (పాంజిమ్) పట్టణంలో బీచ్‌ల సౌందర్యాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని రమ్యంగా వర్ణించేది. అక్కడ ఎటుచూసినా కనబడే తాటిచెట్లూ, ఈతచెట్లూ, అందమైన ఉద్యానవనాల గురించి చెప్పేది. పోర్చుగీసు రాజుల కోటలు, చర్చ్‌లూ అత్యద్భుతమైన కట్టడాలనీ వాటిని చూసి తీరాల్సిందే ననిపించేటట్లుగా కళ్ళకు కట్టినట్లు వర్ణించేది. పనాజీ దగ్గర్లో కొండల మీంచి దుమికే జలపాతాలూ, అందమైన సరస్సులూ కొత్త జంటలకి మంచి పిక్నిక్ స్పాట్స్ అని చెప్పేది. గోవాలో రుచికరమైన వైన్ దొరుకుతుందనీ, అక్కడ చేపలను భలేరుచిగా వండుతారనీ చెప్పేది. వైన్ తాగుతూ, స్పైసీగా ఉన్న సీ ఫుడ్ తింటూ షిప్ డెక్‌ల పైన జరిగే... ఫోక్ డాన్స్ షోలను చూస్తుంటే... ఓహ్... అదో అద్భుత లోకంలో ఉన్నట్టుగా అన్పిస్తుంది" ఎలీజా మేడమ్ మాటలు పల్లవి చెవుల్లో తిరుగుతున్నాయి.

"పాల్వీ, గోవా ఈజ్ ఎ బ్యూటిఫుల్ ప్లేస్ నీకు వీలయితే ఒకసారి తప్పకుండా వెళ్ళిరా...! అనేది. ఎలీజా మేడమ్ ఆంగ్లో ఇండియన్. ఆమె తన పేరును 'పల్లవీ' అని నోరు తిరగక 'పాల్వీ' అని పలికేది. ఆమె ఇంట్లో పాతకాలం నాటి పియానో ఉండేది. తనకు పియానో వాయించడం ఆవిడే నేర్పింది.

"మా నాన్నగారు ఈ పియానో ఆ రోజుల్లో గోవా నుంచి తెప్పించారు. ఇప్పుడు కూడా అక్కడి ఆంటిక్ షాపుల్లో ఇలాంటి పియానోలు దొరుకుతున్నాయని విన్నాను" అని చెప్పింది ఎలీజా మేడమ్.

రేపు ఆంటిక్ షాపుల వైపు వెళ్ళాలి. అలాంటి పియానో దొరికితే హనీమూన్ ట్రిప్ జ్ఞాపికగా కొని తీసికెళ్ళాలి అనుకుంది పల్లవి. ఇలా ఆలోచిస్తూ దిండుపైకి ఒరిగి కళ్ళు మూసుకోబోతూండగా మళ్ళీ మెడపై ఎవరో తట్టారు. కానీ ఈసారి ఆమె భయపడలేదు. బాగా నిద్రలో ఉన్న శశాంక్ చెయ్యి వచ్చి పక్కనే ఉన్న తన మెడపై పడి కిందికి జారడం గ్రహించిన పల్లవికి ఇందాక తన మెడపై ఎవరో తట్టినట్లుగా ఎందుకనిపించిందో అర్థమయ్యింది. తన అర్థంలేని భయానికి నవ్వుకుంది. ఈ ఆలోచనల్లో ఆమె నిద్ర తేలిపోయింది. లేచి బాత్‌రూంలోకి వెళ్ళి వచ్చింది. కిటికీ పరదా కాస్త పక్కకు జరిపింది. అప్పుడప్పుడే తెల్లవారుతోంది. లేలేత సూర్యకిరణాల వెలుగు చీకటి తెరలను చీలుస్తూంది. చీకటి వెలుగుల కలయికలో అల్లంత దూరాన అలలు విరజిమ్ముతూన్న సముద్రం తెల్లని నురుగలు కక్కుతూ తనని రమ్మని ఆహ్వానిస్తున్నట్లు అన్పించింది పల్లవికి. ఆమె తన సూట్‌కేస్‌లో నుండి స్విమ్మింగ్ సూట్ తీసింది. తన ఒంటిపైనున్న దుస్తులు విప్పి స్విమ్మింగ్ కాస్ట్యూమ్ వేసుకుంది. అద్దం ముందు నిలబడి పై నుండి బాత్ రోబ్ తొడుక్కుంటూండగా మెడపైన ఏదో తగిలినట్లుగా అన్పించి భయంతో కెవ్వున అరిచింది. కానీ అద్దంలో తన మెడపైన గెడ్డం ఆనించి వెనకాల నిలబడి ఉన్న వివేక్ ప్రతిబింబం చూసి కుదుట పడింది.

"ఎందుకలా అరిచావ్" అయోమయంగా చూస్తూ అడిగాడు వివేక్.

ఎ... ఎవరో అనుకున్నాను. నువ్వు నిద్రలేవటం గమనించలేదు.. ఐ యామ్ సారీ.." అనవసరంగా భయపడ్డందుకు కాస్త సిగ్గుపడుతూ అన్నది పల్లవి.

"నాకు చెప్పకుండా ఒక్కదానివే స్విమ్మింగ్‌కి వెళ్దామనుకున్నావు కదూ...

"నిద్రపోతున్న నిన్ను డిస్టర్బ్ చేయాలన్పించలేదు..." అన్నదామె.

"కాసేపాగితే నేనూ వస్తాను" అతను బాత్‌రూంలోకి నడిచాడు.

ఇద్దరూ బీచ్ వైపు వెళ్తున్నారు. పల్లవి కొద్ది దూరంలో సమున్నతంగా కనబడుతూన్న ఫోర్ట్ అక్వాడా వైపు చూసింది. రాతితో కట్టిన కోట అది. సూర్యకాంతి ఆ రాళ్ళపై బడి అక్కడక్కడా నీలాలు పొదిగారేమోనని భ్రమ కలిగించేలా నీలిరంగు కాంతిలో చమక్కుమంటున్నాయి. సముద్రపు అలలు వేగంగా వచ్చి ఆ కోటకు ఓ వైపున రాతితో కట్టిన ప్రహరీ గోడకు బలంగా తగిలి వేగంగా వెనక్కు వెళ్ళే దృశ్యాన్ని చూస్తూ నడవసాగింది. బాగా పాలిష్ చేసిన పాలరాయి కుండే నునుపును కలిగి ఉన్న తెల్లని ఆమె పాదాలు కాస్త నలుపురంగులో ఉన్న ఇసుకలోకి కూరుకుపోతుంటే పాదాల్ని లాగి అడుగులు ముందుకు వేస్తూ ఏదో ఇంగ్లీషు పాటని హమ్ చేయసాగింది. వినసొంపుగా ఉన్న ఆ పాటని వింటూ "నువ్వెక్కువగా ఇంగ్లీష్ పాటలే పాడతావెందుకు?" అడిగాడు వివేక్. "నేను ఎలీజా మేడమ్ దగ్గర పియానోతో పాటు ఎక్కువగా ఇంగ్లీషు పాటలే నేర్చుకున్నాను" అన్నది పల్లవి.

"నువ్వు మాట్లాడే ఇంగ్లీషులో వాడే పదాలూ, ఆక్సెంట్ బాగుంటాయి" మెచ్చుకోలుగా అన్నాడతడు.

"ఎందుకంటే నేను ఎలీజా మేడమ్‌ని అనుకరించాలని ప్రయత్నించేదాన్ని. ఎంతో కృషిచేసి ఆమెలా మాట్లాడగలుగుతున్నాను" మాట్లాడుతూ నడుస్తూన్న ఆమె పాదాలు ఒకచోట ఆగాయి. ఆ వైపు కనబడుతూన్న కోట ప్రహరీ గోడకు అవతలి వైపు నుండి ఎగబాకి బయటికి వేలాడుతున్న వందల కొద్దీ తీగెలకు విరగబూసిన బ్లూ బెల్స్‌ను (పుష్పాలను) అబ్బురంగా చూస్తూ నిలబడిపోయింది పల్లవి. నీలిరంగులో ఉన్న ఆ పూలు నక్షత్రాలను తలపింప జేస్తున్నాయి. (ఆ పూలను చూస్తున్న) పల్లవి మదిలో మళ్ళీ 'ఎలీజా మేడమ్' మెదిలింది. ఎలీజా గుర్తుకు రాగానే పల్లవి చెయ్యి అప్రయత్నంగా మెడలో ఉన్న సన్నటి చెయిన్ మీదికి వెళ్ళింది.

'ఎలీజా మేడమ్' ఆమె పెదాలు అస్పష్టంగా పలికాయి. గోవాలో కాలు పెట్టినప్పటి నుండీ ప్రతిక్షణం 'ఎలీజా' జ్ఞప్తికి వస్తూంది ఆమెకు.

నడుస్తూ నడుస్తూ ఆగిపోయిన పల్లవి వైపు ఆశ్చర్యంగా చూశాడు వివేక్. ఆమె నోటి వెంట అస్పష్టంగా వెలువడ్డ మాటేంటో అతనికి సరిగ్గా వినబడక "ఏమిటి పల్లవీ" అడిగాడు.

ఏం లేదన్నట్లుగా తలవూపి "వివేక్ అటు చూడు" అంటూ చెయ్యితో 'బ్లూబెల్స్' తీగల వైపు చూపింది.

"ఓ అదా...! అందులో వింతేముంది, ఏదో పిచ్చి

మొక్క" అన్నాడు తేలిగ్గా.

పల్లవి మనస్సు చివుక్కుమన్నది. తనకెంతో అందంగా కనబడుతూన్న ఆ చెట్టు వివేక్‌కి పిచ్చిమొక్కలా కనబడుతూందా...? తను చిన్ననాటి నుండీ ఎలీజా మేడమ్ ఇంట్లో ఉండే బ్లూబెల్ తీగెకు పూచిన పూలను కోసి ఫ్లవర్ వేజ్‌లలో అలంకరించేది. ఆ పూలంటే తనకెంతో ఇష్టం.

తన మాటలతో చిన్నబోయిన పల్లవి ముఖాన్ని చూసిన వివేక్‌కి తన పొరపాటు అర్థమయ్యింది.

"నీ కంతగా ఇష్టమవుతే అలాంటి మొక్కని మనింట్లో నాటుదాం సరేనా..." అన్నాడు అనునయంగా.

ఆ మాటలతో పల్లవి ముఖం వికసించింది.

"ఇంకాసేపట్లో ఎండెక్కువవుతే... స్కిన్ టాన్ అవుతుంది. మనం త్వరగా స్విమ్మింగ్ చేయడం ముగించి కాటేజీకి వెళ్ళిపోదాం. అదీగాక ఈరోజు మనం బేసిలికా బాంజీసస్ చర్చ్‌ని చూడడానికి వెళ్ళే ప్రోగ్రాం ఉంది. గైడ్ మనల్ని పదకొండు గంటలకల్లా అక్కడికి రమ్మన్నాడు కదా...!" అన్నాడు వివేక్.

అవునన్నట్లుగా తలవూపి పల్లవి బాత్ రోబ్ విప్పింది. సముద్రానికి బాగా దగ్గరకు రావడం వల్ల నురగలు కక్కుతూ వేగంగా వచ్చే అలలు వాళ్ళను నడుం వరకూ తడిపి వెనక్కు వెళుతున్నాయి. అలల ధాటికి తట్టుకోవడానికి ఆసరాగా పల్లవి వివేక్‌ని గట్టిగా పట్టుకుంది. సముద్రం పైకి తేలిన సూర్యుడు తన లేలేత కిరణాలను వెదజల్లుతున్నాడు. ఆ కిరణాల తాకిడికి నీలిమ మెడలోని మంగళసూత్రాలు చమక్కుమని మెరుస్తున్నాయి. ఒక కిరణం సూటిగా వచ్చి ఆమె మెడలోని మరో సన్నటి చెయిన్‌కు వ్రేలాడుతూన్న లాకెట్‌పై పడింది. దాంటో బ్లూబెల్ ఫ్లవర్ లాగా ఎనామిల్‌తో పెయింట్ చేసి ఉన్న ఆ లాకెట్ వింతైన కాంతిని సంతరించుకుంది. వివేక్ దృష్టి ఆ లాకెట్‌పై పడింది. అతను పల్లవి మెడలోని ఆ చెయినూ, లాకెట్ వంక చూస్తూ "నువ్వెప్పుడూ దీనిని నీ మెడలోంచి తియ్యగా చూడలేదు. మన పెళ్ళిరోజు కూడా అది నీ మెడలో ఉండడం చూశాను. ఎప్పుడూ నిన్నంటి పెట్టుకొని ఉండే ఈ చెయిన్ని నువ్వు బాగా ఇష్టపడే వాళ్ళెవరో గిఫ్ట్‌గా ఇచ్చి ఉండాలి. అవునా" అడిగాడు వివేక్.

అవునన్నట్లుగా తలవూపి "ఎలీజా మేడమ్... ఇచ్చారు" అన్నది.

"ఎలీజా... ఎలీజా... గోవాలో అడుగు పెట్టినప్పటి నుండీ నువ్వు ఆ పేరునే జపిస్తున్నావు... ఇంతకీ ఎవరా ఎలీజా... మేడమ్..."

అతడడిగిన దానికి సమాధానంగా పల్లవి ఎలీజా గురించి చెబుతూ కాటేజీ వైపు నడవసాగింది. అతను శ్రద్ధగా వింటూ ఆమె ననుసరిస్తూ వింటున్నాడు.

❍ ❍ ❍

ఎలిజబెత్ ఆంగ్లో ఇండియన్ మహిళ. ఆమె బర్కత్‌పురాలో ఒంటరిగా వుండేది. కాలనీ వాళ్ళంతా ఆమెను ఎలీజా మేడమ్ అని పిలిచేవాళ్ళు. కాలక్షేపం కోసం ఆమె రోజరీ కాన్వెంట్‌లో విద్యార్థులకు ఇంగ్లీషు పాఠాలు చెప్పేది. గులాబీ రంగు శరీర ఛాయ, నీలి రంగు కళ్ళు, గోధుమ వన్నె వెంట్రుకలు, ఎర్రని లిప్‌స్టిక్ వేసుకున్న పెదాలపై ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో విచ్చుకుని ఉన్న పెదాలతో చైతన్య స్రవంతిలా ఉండేది. తెల్లటి రంగుపై చిన్న చిన్న పువ్వుల ప్రింటు ఉన్న లాంగ్ ఫ్రాక్‌లు వేసుకునేది. ఎడం చేతికి నల్లటి స్ట్రాప్ ఉన్న రిస్ట్ వాచీ, చెవులకు ఒంటి ముత్యం దుద్దులు మాత్రమే అలంకరించుకునేది. ఆమె చర్మంపై ఉన్న ముడుతలు కాస్త వంగిన వీపు ఆమె ముదిమిని తెలుపుతున్నా ఈవిడ వయసులో ఉన్నప్పుడు చాలా అందంగా ఉండేదని ఆమెను చూసిన వాళ్ళు అనుకునేవాళ్ళు.

ఎలిజబెత్ కుటుంబీకులు ఈ దేశం బ్రిటీషు వాళ్ళ ఏలికలో ఉండగా ఇక్కడికి వచ్చారు. వైస్రాయ్‌కి సన్నిహితులు. ఆమె తండ్రి ఇండియన్‌ని వివాహం చేసుకొని ఇక్కడే ఉండిపోయాడు. తల్లితండ్రులు పోయాక ఎలిజబెత్ ఒంటరిదయింది. ఆమె వివాహం చేసుకోక పోవడానికి కారణమేమిటో ఎవరికీ తెలియదు. ఎవరినో ప్రేమించి భంగపడిందనే ఊహాగానాలున్నా స్నేహశీలి, మృదు భాషిణీ అయిన ఆమెతో ఆ కాలనీ వాసులందరూ స్నేహంగా, గౌరవంగా మెలుగుతారు. ఆమె వ్యక్తిగత జీవితం గురించి ఆరాలు తీసే ప్రయత్నాలెవ్వరూ చేయ సాహసించేవారు కాదు.

ఎలిజబెత్‌కు ఓ రోజు స్కూల్లో గేటు కమ్మీలను పట్టుకొని ఏడుస్తూన్న చిన్నారి కనబడింది. ఆమె పరుగున వచ్చి ఆ పాపని అక్కున చేర్చుకొని బుగ్గలపై చారికలు కట్టిన కన్నీటిని తుడిచింది. హ్యాండ్ బాగ్‌లోంచి చాక్లెట్ తీసి ఇచ్చింది.

ఇంతలో కె.జి. క్లాస్ టీచర్ అటువైపు పరుగున వచ్చి ఎలిజెబెత్ ఒళ్ళో కూర్చుని చాక్లెట్ తింటూన్న పాపను చూసి "ఈ పాప రెండ్రోజుల క్రితమే కె.జి.లో జాయినయ్యింది. పేరు పల్లవి. పాప తల్లి క్లాస్‌రూంలో వదిలి వెళ్ళడం నేను చూశాను. కానీ ఎలా బయటికి వచ్చిందో ఏమో? స్కూలంతా వెతికాను. ఎంత కంగారు పడిపోయానో. థాంక్ గాడ్, క్షేమంగా ఉంది" అన్నది గుండెలపై చెయ్యివేసుకుంటూ.

ఆరోజు అలా కలుసుకున్న ఎలిజబెత్ పల్లవిల మధ్య అనురాగపూరితమైన బంధం పెనవేసుకుపోయింది. పల్లవీ వాళ్ళ కుటుంబం ఎలిజబెత్ ఉండే కాలనీలో వారం క్రితమే దిగారని తెలిసింది. ఎలిజబెత్ పల్లవీ వాళ్ళ తల్లిదండ్రులతో మాట్లాడి పల్లవిని రోజూ తనతో బాటుగా స్కూలుకు తీసుకెళ్ళేది. రోజూ సాయంకాలం పల్లవి ఎలిజబెత్ ఇంట్లోనే గడిపేది. ఎలిజబెత్ ఇంట్లో పియానో ఉండేది. ఆమె పల్లవికి పియానోతో పాటు రైమ్స్, ఇంగ్లీషు పాటలూ నేర్పేది. పల్లవి మిడిల్ స్కూల్లోకి వచ్చేసరికి ఎలిజబెత్ రిటైరయ్యింది. పల్లవి వయసు పెరుగుతూన్న కొద్దీ ఎలిజబెత్‌ని అనుకరించేది. ఆమెలా చక్కని ఇంగ్లీషు మాట్లాడాలని ప్రయత్నించేది. ఎలిజబెత్‌లా బొట్టు పెట్టుకోకుండా ఉండేది. ఆమెలా జుట్టు కత్తిరించుకుంటాననీ, ఆమె వేసుకునే లాంటి గౌనులు కుట్టించమనీ తల్లి వద్ద మారాం చేసేది. పల్లవి ఎలిజబెత్‌లు గంటల తరబడి ఛెస్ ఆడేవాళ్ళు. పల్లవికి ఆ ఆటలో ఎన్నో ఎత్తుగడలూ, వాటిని ఎదుర్కొనే మెళకువలూ నేర్పింది ఎలిజబెత్.

పల్లవికి ఆ ఇంట్లోని ప్రశాంతత అంటే ఎంతో ఇష్టం. విశాలమైన ఆ ఇంట్లో అంతా ఆంటిక్ ఫర్నిచర్ ఉండేది. ఇంట్లో పింగాణీ కుండల్లో పెంచిన మనీ ప్లాంట్లు కంటికి ఆహ్లాదంగా కనిపించేవి. పెద్ద పెద్ద గాజు కాండిల్ స్టాండ్స్‌లో ఉన్న సెంటెడ్ కాండిల్స్‌ని సాయం సంధ్యా సమయంలో వెలిగించినప్పుడు ఇల్లంతా చక్కని సువాసన పరుచుకునేది. బయట కిటికీ ఊచలకు ఎగబాకి గుత్తులు గుత్తులుగా పూచిన బ్లూబెల్ పువ్వులంటే పల్లవికి భలే ఇష్టం. వాటిని కోసి ఫ్లవర్‌వేజ్‌ల్లో అలంకరించేది. ఎలిజబెత్ పడక గదిలో మూడు నిలువెత్తు అద్దాలమర్చిన పెద్ద డ్రెస్సింగ్ టేబుల్‌పై పాతకాలం నాటి జ్యువెల్ బాక్స్ (నగలు దాచే పెట్టె) ఉండేది. బంగారపు రంగులో ఉన్న ఆ పెట్టెపై ఎనామిల్‌తో ఊదా రంగులో తీగెలు, ఆ తీగెలకు ఆకుపచ్చని ఆకులూ, నీలిరంగు బ్లూబెల్ పుష్పాలూ పెయింట్ చేసి ఉన్నాయి. ఆ పెట్టెను ఆమె ఎంతో అపురూపంగా చూసుకునేది. దాన్ని ప్రతిరోజూ ఆమే స్వయంగా మెత్తటి గుడ్డతో తుడిచేది. తీగెలూ ఆకుల మధ్య దూదితో శుభ్రం చేసేది. ఆ పెట్టెకు గొళ్ళెం ఉండేది. దానికో తాళం కూడా వేసేది ఆమె. అక్కడక్కడా రంగు వెలిసి చిలుము పట్టిన గొళ్ళెంతో ఉన్న ఆ పెట్టే అక్కడున్న అన్ని విలువైన వస్తువుల్లో దిష్టిపిడతలా కనిపించేది.

ఎలిజబెత్ ఇంటికి బంధువులెవరూ వచ్చేవాళ్ళు కారు. ఉదయాన్నే పనిమనిషి వచ్చి ఇల్లు శుభ్రం చేసి నీట్‌గా సర్ది బ్రేక్‌ఫాస్ట్ సిద్ధంచేసి వెళ్ళేది. నాలుగు స్లైసుల బ్రెడ్, ఉడకబెట్టిన కోడిగుడ్డు, ఫ్రూట్‌జ్యూస్ తీసుకునేది ఎలిజబెత్. మళ్ళీ సాయంకాలం వచ్చిన పనిమనిషి పడకగదిలో మంచంపై పరుపు, దిళ్ళూ సరిచేసి దుప్పటి మార్చి రాత్రి భోజనం సిద్ధం చేసేది. రెండు చపాతీలు చేప మాంసంతో గానీ వేట మాంసంతో గానీ తినేది. పడుకునే ముందు ఒక కప్పు పాలు తాగేది. మధ్యాహ్నం లంచ్‌లోకి మాత్రం కేవలం కూరగాయలతో సలాడ్, పళ్ళూ తీసుకునేది. రోజులో చాలా భాగం పుస్తకాలతో గడిపేది. ఆమె ఇంట్లో మంచి లైబ్రరీ ఉంది. సాయంకాలాలు పియానో వాయించేది. రాత్రి పడుకునే ముందు బైబిల్ చదివేది. ఇదీ ఎలిజబెత్ దినచర్య. ఈ మధ్య నడివయసులో ఉన్న వ్యక్తి తరచుగా ఎలిజబెత్ ఇంటికి వచ్చి వెళ్తున్నాడు. అతని పేరు జార్జ్ అనీ, తమకు దూరపు బంధువులబ్బాయనీ చెప్పింది ఎలిజబెత్. ఎలిజబెత్‌కు వార్ధక్యం మీదబడటంతో బయటికి వెళ్ళలేకపోతూంది. జార్జ్ వారానికొకసారి వచ్చి ఇంట్లోకి కావాల్సిన సరుకులవీ తెచ్చిపెడుతున్నాడు. కరెంటు బిల్లు, టెలిఫోన్ బిల్లు లాంటివి కట్టి వస్తున్నాడు. ఎలిజబెత్‌కు అవసరమైనప్పుడు కంటి డాక్టరు దగ్గరికీ, డెంటిస్ట్ దగ్గరికీ తీసుకెళుతున్నాడు. సుస్తీ చేసినప్పుడు మందులవీ దగ్గరుండి శ్రద్ధగా తినిపిస్తున్నాడు. వృద్ధాప్యంలో తోడుగా ఎలిజబెత్‌కు నా అనే మనిషి ఒకరు దొరికారని ఇరుగు పొరుగు వాళ్ళు సంతోషించారు. పల్లవి కాలేజీలోకి వచ్చింది. చదువు ఎక్కువగా ఉండటంతో ఎలిజబెత్ ఇంటికి రాకపోకలు తగ్గాయి. ప్రతి ఏడాదీ క్రిస్మస్ పండుగకు ఎలిజబెత్ పల్లవికి ఒక గిఫ్ట్ ఇచ్చేది. ఈసారి కూడా క్రిస్మస్ పండుగకు పల్లవిని ఆహ్వానించింది. క్రిస్మస్ గిఫ్ట్‌గా ఎలిజబెత్ తన మెడలో ఎప్పుడూ ఉండే సన్నటి ఛెయిన్ తీసి పల్లవి మెడలో వేసింది. "పాల్వీ దీన్నెప్పుడూ నీ మెడలోంచి తీయకు. తీయాల్సిన సమయం వచ్చినప్పుడు నేనే చెప్తాను. గాడ్ బ్లెస్ యూ మై చైల్డ్" అని తనను హగ్ చేసుకుంది. ఎందుకో ఆమె కళ్ళు చెమర్చినట్లన్పించాయి. ఆమెను వదిలి వస్తూంటే పల్లవిని కూడా ఏదో తెలియని దిగులు ఆవహించింది.

ఆ మర్నాడే ఎలిజబెత్ చనిపోయిందనే పిడుగులాంటి వార్త తెలిసింది. అమ్మ వద్దంటున్నా వినకుండా పరుగున

ఎలిజబెత్ వాళ్ళింటికి వెళ్ళింది పల్లవి. పడక గదిలో ఎత్తైన మంచం మీద ప్రశాంతంగా నిద్రపోతున్నట్లున్న ఎలీజా మేడం భౌతికకాయాన్ని చూడగానే దుఃఖం పట్టలేక పోయింది. వెనకాలే వచ్చిన అమ్మ పల్లవిని ఓదారుస్తూ అక్కడి నుండి ఇంటికి తీసికెళ్ళే ప్రయత్నం చేసింది. వెళ్తూ వెళ్తూ ఆఖరిసారిగా పల్లవి ఎలీజా మేడమ్ ముఖాన్ని చూసింది. మళ్ళీ ఆమె కళ్ళు జలపాతాలే అయ్యాయి. ఎలీజా మేడమ్ మృదువైన స్పర్శ, ప్రేమపూర్వకమైన ఆమె మాటలు, చెప్పిన కథలు, నేర్పిన పాటలూ ఆటలూ ఒకటా రెండా లెక్కలేనన్ని జ్ఞాపకాలు ఎప్పటికీ మరచిపోలేదు... ఎలీజా మేడం ఇక లేరు... మరింక తనా ఇంటికి ఎందుకు వస్తుంది...? ఎవరి కోసం వస్తుంది...? కన్నీటి తెరల మధ్య ఆఖరిసారిగా ఆ ఇంటినీ... నిత్యం ఎలీజా మేడం వాడే వస్తువులనూ చూస్తూ బయటకు నడిచింది. ఎలీజా మేడం మంచం పక్కనే గోడకు ఆనించి ఉన్న వాకింగ్ స్టిక్, సైడ్ టేబుల్ పైన కళ్ళద్దాలు, రోజూ చదివే బైబిల్ ఇవన్నీ ఎలీజా మేడం ఆకస్మిక మరణానికి మౌనంగా సంతాపం తెలుపుతున్నట్లుగా ఉన్నాయి. ఇవన్నీ చూస్తూ వెళ్తున్న పల్లవికి అక్కడ ఆ గదిలో ఏదో వెలితిగా అన్పించింది... ఏదో... అక్కడ... ఎప్పటికీ ఉండేదేదో... లేనట్లుగా...

ఆ తరువాత కాలనీలో అందరూ ఎలిజబెత్ మరణం గురించి ఎన్నోరకాలుగా మాట్లాడుకున్నారు. చనిపోయే ముందురోజు రాత్రి ఆమె భోజనం చేసిన గుర్తుగా టేబుల్‌పై వదిలిన ప్లేటు, తినగా మిగిలిన భోజనం పాత్రలు అలాగే డైనింగ్ టేబుల్‌పై ఉన్నాయి. పడుకో బోయే ముందు పాలు తాగిన గుర్తుగా ఖాళీ గాజు గ్లాసు మంచం పక్క టేబుల్‌పై ఉందట. ఉదయాన్నే వచ్చిన పనిమనిషి కాలింగ్ బెల్ ఎంత నొక్కినా తలుపు తెరవక పోవడంతో అనుమానం వచ్చి పడక గది కిటికీలోంచి చూస్తే మంచంపై పడుకొని కనబడిందట. కానీ ఎంత పిలిచినా లేవకపోవడంతో ఇరుగు పొరుగు వాళ్ళను పిలిచిందట. వంటింటి వైపు తలుపు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్ళి చూడగా చనిపోయి ఉందట. దొడ్డిదారిన తలుపు తెరిచి ఉండటం ఆమె శరీరం కాస్త నీలి వర్ణంలోకి మారి ఉండటం పోలీసులకు అనుమానం కలిగించాయి. కానీ ఇంట్లో సామగ్రి, విలువైన వస్తువులూ ఎక్కడివక్కడే ఉండటం వల్లా, చీమకు కూడా హాని తలపెట్టని ఆమె పవిత్ర దేహాన్ని పోస్టుమార్టం పేరుతో ఛిద్రం చేయవద్దని అందరూ కోరడంతో పోలీసులు ఆ విషయాన్ని అక్కడితో వదిలిపెట్టారు. ఎలిజబెత్ తరచుగా ఫండ్స్ ఇచ్చే సెయింట్ గేబ్రియల్ చర్చి వాళ్ళు ఆమె ఇంటిని మేన్‌టేన్ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే చర్చ్ సందర్శకులకు అతిథి గృహంలా మార్చారు. చెప్పడం ముగించిన పల్లవి కళ్ళల్లో నీళ్ళు బుగ్గలపైకి జారుతున్నాయి. జరిగిందంతా విన్న వివేక్ పల్లవి ఆవేదనను అర్థం చేసుకున్నాడు. ఆమె కన్నీళ్ళు తుడిచి ఓదార్పుగా దగ్గరికి తీసుకున్నాడు. కానీ డిసిపి క్రైమ్ బ్రాంచ్ అయిన అతని మనసుకి ఎలిజబెత్‌ది సహజ మరణం కాదని అనిపించింది.

"ఎలీజా మేడమ్ పోయి ఎన్నాళ్ళవుతూంది'' అడిగాడు.

"నాలుగేళ్ళు" అన్నది పల్లవి.

○ ○ ○

పల్లవీ, వివేక్‌లు పదకొండు గంటలకల్లా బేసిలికా బామ్ చర్చ్‌కి చేరుకున్నారు. అక్కడి బాలయేసును దర్శించుకున్నారు. ఎలీజా మేడమ్‌ది సహజ మరణం కాక హత్య అయినట్లవుతే హంతకున్ని శిక్షించమనీ ఆమె పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చమనీ జీసస్‌ని వేడుకుంది పల్లవి. ఆ చర్చ్‌లో పదహారవ శతాబ్దం నాటి సెయింట్ జేవియర్ పార్థివ శరీరం ఉంది. అద్దాల షోకేసులో వెండి ఫ్రేములో అద్దాలు బిగించిన కాఫిన్‌లో భద్రపరిచి ఉంది. శతాబ్దాలు గడిచినా ఆ భౌతిక కాయం చెక్కుచెదరలేదు. ఇప్పటికీ ఆ దేహానికి గోళ్ళు పెరగడం విశేషం. ఆ చర్చ్ లోపలి గోడలపై పనితనంలో ఎంతో నైపుణ్యం ఉంది. బంగారంతో పెయింట్ చేసిన ఆ ఆకృతులను చూడడానికి రెండు కళ్ళూ చాలవు. ఆ చర్చ్ విశేషాలను చూసిన తర్వాత కాస్త దూరంలో ఉన్న వాస్కోడగామా బీచ్‌కి వెళ్ళేసరికి సాయంకాలం అయ్యింది. అక్కడ అలలు మరీ ఉధృతంగా ఉన్నాయి. "వాస్కోడగామా బీచ్ చాలా ప్రమాదకరమైంది. 'పాల్వీ' అక్కడ ఏ మాత్రం ఏమరుపాటు పనికిరాదు. జాగ్రత్తగా ఉండాలి" ఎలీజా మేడమ్ మాటలు గుర్తుకు వచ్చాయి. ముందుకు వెళ్ళబోతూన్న వివేక్‌ని ఆపుతూ మనం ఇక్కడ్నించి వెళ్ళిపోదాం అన్నది పల్లవి. వాళ్ళు వెనుదిరిగి వెళ్తుండగా ఎవరో ఒక వ్యక్తి తనలో తాను ఏదో పిచ్చిపిచ్చిగా మాట్లాడుకుంటూ సముద్రం వైపు వెళ్తున్నాడు. "అందులో ఏమీలేదు. అంతా మోసం, మోసపోయాను, కాదు... కాదు నేను పాపం చేశాను... అందుకే నాకేం దొరకలేదు... అహ్హహ్హా పెద్దగా నవ్వుతూ సముద్రం వైపు వెళ్తున్నాడు. ఆ పిచ్చివాడి ముఖం వంక చూసిన పల్లవి ఉలిక్కిపడింది. అతడు... అతడు జార్జ్... ముమ్మాటికీ జార్జే... ఎలిజా ఇంట్లో అప్పట్లో కన్పించిన జార్జే... ఇక్కడున్నాడేమిటి? అదే విషయం వివేక్‌తో చెప్పింది పల్లవి.

ఎలీజా మేడమ్ పోయినప్పుడు జార్జ్ అక్కడ లేడా అడిగాడు వివేక్.

"ఆమె పోయేకంటే నాలుగు రోజుల ముందే" నేను ఊరెళుతున్నాను. కొన్నాళ్ల వరకూ రాను. ఎలీజా ఆంటీని జాగ్రత్తగా చూసుకోవాలి అని పనిమనిషితో చెప్పి వెళ్ళాడట."

"ఓ..హో" ఆలోచిస్తున్నట్లుగా నిలబడిపోయాడు వివేక్.

జార్జ్ సముద్రానికి బాగా దగ్గరగా వెళ్ళాడు. అక్కడున్న ఒకరిద్దరు టూరిస్ట్‌లు అతన్ని ఆపే ప్రయత్నం చేశారు. కానీ ఆ లోపలే ఓ పెద్ద అల భయంకరంగా గర్జిస్తూ వచ్చి అతన్ని సముద్రంలోకి లాక్కెళ్ళింది. ఆ దృశ్యం చూసిన పల్లవి భయంతో స్పృహతప్పి పడి పోయింది.

○ ○ ○

మరునాడు పల్లవీ వాళ్ళు ఆంటిక్ షాపుల్లో పియానో కొనడానికి వెళ్ళారు. కానీ పల్లవికి వచ్చిన పియానో ఎక్కడా దొరకలేదు. ఎన్నో షాపులు గాలించారు. చివరిగా ఒక షాపుకి వెళ్ళారు. అక్కడ పియానోలేవీ లేవన్నాడు షాపతను. ఆ షాపు ఓనరు చార్లీచాప్లిన్ వేషధారణలో విచిత్రంగా ఉన్నాడు. పల్లవి పియానో కొనలేకపోయానన్న నిరాశతో వెనుదిరుతుండగా ఆమె చూపు ఓ దగ్గర ఆగింది. అక్కడ ఓ రాక్‌లో పాతకాలం నాటి జ్యుయెలరీ బాక్స్ కనబడింది. తీగెలూ, ఆకులూ, బ్లూబెల్ పుష్పాలూ ఎనామిల్ పెయింట్ చెయ్యబడి ఉన్న పాతకాలం నాటి జ్యువెల్ బాక్స్ అది. ఎలీజా మేడమ్ ఇంట్లో ఉన్న లాంటిది... లాంటిది... కాదు... అదే బాక్స్... ఎలీజా మేడమ్ ఎంతో అపురూపంగా చూసుకునే ఆ బాక్స్‌ని తనెక్కడ ఉన్నా గుర్తుపట్టగలదు. అయితే ఆనాడు ఎలీజా మేడమ్ ఇంట్లో తన మనసుకు తోచిన వెలితి ఏమిటో ఇప్పుడర్థమయ్యింది. ఆనాటి దృశ్యాన్ని పునరావృత్తం చేసుకుంది. మంచంపై ఎలీజా మేడం భౌతికకాయం, పక్కనే గోడకు ఆనించి ఉన్న వాకింగ్ స్టిక్, సైడ్ టేబుల్‌పై కళ్ళద్దాలు, బైబిల్... మంచానికి ఓ పక్కగా ఉన్న డ్రెస్సింగ్ టేబుల్ దానిపైన ఎప్పుడూ ఉండే జ్యువెల్ బాక్స్... ఉండాల్సిన ఆ స్థలంలో... ఏదో లేనట్లన్పించడం ఆ దుఃఖంలో తను అక్కడేదో వెలితిగా ఉందనుకుంది... కానీ... ఈ రోజిక్కడ ఈ బాక్స్‌ని చూస్తుంటే ఆ వెలితేమిటో అర్థమయ్యింది. ఆ రోజక్కడ మాయమైన జ్యువెల్ బాక్స్ ఇక్కడికెలా వచ్చింది. అసలు తను చూసేదంతా కలా...

## దీపం

ఎంత గాలి వచ్చిన
ఎంత వాన వచ్చిన
ఆరిపోని దీపం
ఉదయ, అస్తమయాలలోను
కరిగి నీవై ప్రవహించె బాధల్లోను
మనిషిని లాలించె, నిలదీసె ఋతుచక్రంలోను
నిరంతరం
దీపం వెలుగుతూనే ఉంటుంది.
అలెగ్జాండర్ కత్తి అంచులో
గాంధీజీ అహింసా చర్కా చక్రంలోను
చూడకల్గె చూపులకు
ఆ దీపపు కాంతుల మెరుపులు కనిపిస్తాయి
మనిషి అంతరంగపు ఆశల దీపం
ఆరిపోదు
కాంతి చిమ్ముతునే ఉంటుంది
మరణాన్ని జయించగల శక్తి
మరెన్నో దీపాల్ని వెలిగించగల శక్తి
నిరాశను చెండాడే శక్తి
నిర్మల
ఆశల
దీపానికుంది

-జె. కొండన్న

నిజమా...? కళ్ళు నలుముకొని మరీ చూసింది. అదే... అదే... జ్యువెల్ బాక్స్... దానివంకే చూస్తూ బొమ్మలా నిలబడిపోయిన పల్లవి "వెళదామా" అన్న వివేక్ మాటలతో తేరుకుంది.

"వివేక్ అటు చూడు ఆ జ్యువెల్ బాక్స్... ఎలీజా మేడమ్‌ది. ఆవిడ పోయిన రోజున... ఆమె ఇంట్లో నాకు... ఈ బాక్స్... ఆపై మాట్లాడలేకపోయింది. కానీ వివేక్ విషయమేమిటో అర్థం చేసుకోగలిగాడు.

షాపతనితో "ఆ బాక్స్ చూపించండి" అడిగాడు.

ఇన్ని అందమైన ఖరీదైన వస్తువులుండగా వీళ్ళకిదే నచ్చిందా అన్నట్లుగా వీళ్ళవైపు విచిత్రంగా చూస్తూ అతను దాన్ని తెచ్చి వీళ్ళముందుంచాడు.

ఆ బాక్స్‌కి ఎలీజా మేడం ఎప్పుడు వేసే తాళం లేదు. గొళ్ళెం కూడా విరగ్గొట్టబడి ఉంది.

దీని ఖరీదెంత అడిగాడు వివేక్.

ఇది చాలా పురాతనమైంది. యూరప్‌లో తయారు చేయబడింది. దీనిపైనున్న బంగారు పూత, ఎనామిల్ పెయింట్ చెదిరి అలా కనబడుతుంది. మరమ్మతులు చేయిస్తే అందంగా అవుతుంది... చెప్పుకు పోతున్నా డతను.

"ప్రస్తుతం ఉన్న కండీషన్లో దీని ఖరీదెంత" మళ్ళీ అడిగాడు వివేక్.

"పాతిక వేలు" అన్నాడు షాపతను.

"ఓ... ఇది నీ దగ్గరికెలా వచ్చింది" అడిగాడు వివేక్.

"అది మా బిజినెస్ రహస్యం మీకెందుకు చెప్పాలి"

వివేక్ తన ఐడెంటిటీ కార్డు తీసి చూపాడు. "ఈ బాక్స్ హైదరాబాద్‌లో దొంగిలించబడి ఇక్కడ దొరికింది. నేనీ కేసు ఇన్వెస్టిగేట్ చేస్తున్నాను"

దబాయించాడు వివేక్.

షాపతనికి చెమటలు పట్టాయి. హ్యాండ్ కర్చీఫ్‌తో చెమటలు తుడుచుకుంటూ "సర్ నాకేం తెలియదు. నన్ను నమ్మండి. ఓ మ్యాడ్ గయ్ దగ్గర దీన్ని రెండు వందలకు కొన్నాను", "కావాలంటే మీరు దీన్ని ఊరికే తీసికెళ్ళండి" అన్నాడు వణికిపోతూ.

ఈ బాక్స్‌ని ఆ పిచ్చివాడు తనంత తానుగా వచ్చి అమ్మాడా... అతని పేరేమిటో తెలుసా...?

అతనెవరో నాకు తెలియదు. సుమారు నాలుగేళ్ళ క్రితం ఖాళీగా ఉన్న ఈ బాక్స్ చేతిలో ఉంచుకొని వీధులు పట్టుకొని తిరుగుతూ కనపడ్డవారికల్లా బాక్స్ వంక చూపి అందులో ఏమీ... ఏమీ లేదు... మోసపోయాను... కాదు... కాదు పాపం చేశాను. అందుకే నాకేమీ దొరక లేదు... అంటూ పిచ్చిగా నవ్వుతూ ఉండేవాడు. ఆంటిక్ వస్తువులు కొని అమ్మే వ్యాపారస్థుడ్ని కనుక ఆ బాక్స్ పాతకాలం నాటిదనీ, ఎప్పటికైనా దాన్ని కాస్త ఖర్చుచేసి మరమ్మతులు చేసి అమ్మితే లాభం వస్తుందనీ గ్రహించి ఆ పిచ్చివాడి చేతిలో రెండొందలు పెట్టి దాన్ని తీసు కున్నాను. ఇంతవరకూ మా షాపుకు వచ్చిన వాళ్ళెవరూ ఆ బాక్స్ వైపు కన్నెత్తి చూడలేదు. టూరిస్టులయిన మీరు ఆ బాక్స్‌ని అడగడంతో మిమ్మల్ని తేలికగా మోసం చేసి డబ్బు చేసుకోవచ్చన్న దురాశతో దాని గురించి ఏదేదో వాగాను. నిజానికి నాకేమీ తెలియదు. నన్ను వదిలేయండి" బతిమాలసాగాడు.

వివేక్ షాపతనికి రెండువందలు ఇచ్చి ఆ బాక్స్ తీసుకున్నాడు.

కాటేజీకి చేరుకున్న తరువాత పల్లవి బాగా దుమ్ము కొట్టుకుపోయిన ఆ జ్యువెల్ బాక్స్‌ను బయటా, లోపలా చక్కగా శుభ్రం చేసింది. దాన్ని చూస్తున్న ఆమెకు ఎలీజా మేడమ్‌ని చూసినంత సంతోషం కలుగసాగింది.

"పల్లవీ బాగా పొద్దుపోయింది. అదీగాక అలసి పోయావు కూడా. పడుకుందువుగానీ పద" ఆమె చెయ్యి పట్టుకొని మంచం దగ్గరికి తీసుకెళ్ళాడు వివేక్.

❍ ❍ ❍

అలసి సొలసి నిద్రిస్తున్న పల్లవి మెడపై ఎవరో చేత్తో తట్టినట్లన్పించింది. ఉలిక్కిపడి లేచింది పల్లవి. పక్కకు తిరిగింది. అక్కడ వివేక్ లేడు. పల్లవి కళ్ళు భయంతో పెద్దవయ్యాయి. బాగా మెలుకువ వచ్చిన ఆమె మెడపై సన్నటి ఛెయిన్ ఉన్నచోట ఎవరో సుతిమెత్తగా స్పృశించినట్లన్పించింది. చిరపరిచితమైన స్పర్శ... అది... అది ఎలీజా మేడమ్... కెవ్వున అరిచింది పల్లవి. నిద్ర రాక బాల్కనీలో తిరుగుతున్న వివేక్ కంగారుగా పరిగెత్తు కొని వచ్చాడు. "ఏం జరిగింది పల్లవీ" ఆమెను కుదుపుతూ అడిగాడు.

"ఎలీజా మేడమ్ ఇక్కడెక్కడో ఉన్నారు" పెదాలు వణు కుతుండగా అన్నది.

"ఆర్యూ మ్యాడ్, చనిపోయిన ఎలీజా మేడమ్ ఇక్కడుండుటమేమిటి" అంటూ వివేక్ లైట్ వేశాడు.

"నిజం వివేక్. నా మాట నమ్ము. ఆవిడ నన్నిక్కడ తాకింది" మెడపైన చెయ్యి పెట్టి చూపింది. ఆ వైపు చూసిన వివేక్ దృష్టి చెయిన్‌కున్న బ్లూబెల్ లాకెట్‌పై పడింది. అతని బుర్రలో ఫ్లాష్‌లా ఏదో మెరిసింది. వెంటనే ఒక్క అంగలో వెళ్ళి బ్లూబెల్ పువ్వులు పెయింట్ చేయబడి ఉన్న జ్యువెల్ బాక్స్ తెరిచి లోపల దాని అడుగు భాగాన్ని పరీక్షగా చూశాడు. ఒక మూలగా సన్నని రంధ్రం ఉంది. పురుగు తొలిచినట్లుగా అన్పిస్తున్న ఆ రంధ్రాన్ని ఎంతో పరీక్షగా చూస్తే కీ హోల్‌లాగా కనబడింది. ఆ రంధ్రాన్ని చూసిన వివేక్ కళ్ళు మెరిశాయి. అతడు పల్లవి మెడలోని లాకెట్ తీసి ఆ కీహోల్‌లో ఉంచి తిప్పాడు. చిత్రంగా అక్కడ ఒక రహస్యపు అర తెరుచుకుంది. అందులో ఒక కాగితంపై ముత్యాల్లాంటి అక్షరాలతో ఇంగ్లీషులో ఏదో రాసి ఉంది. దాని కింద ఏదో జిగురులాంటి పదార్థంతో కదలకుండా అతికించిన తొమ్మిది విలువైన రత్నాలు మెరుస్తున్నాయి.

వివేక్ ఆ కాగితంలో రాసి ఉన్న విషయాన్ని చదువ సాగాడు.

"అతి విలువైన ఈ రత్నాలు నా ప్రేమికుడు నా కిచ్చిన కానుకలు. మేము గోవాలో ఉండగా రాజవంశీ కుల విందు వినోదాలకు తరుచుగా వెళ్ళాల్సి వచ్చేది. అక్కడ నాకొక రత్నాల వర్తకునితో పరిచయమైంది. అప్పుడు నాకు పద్దెనిమిదేళ్ళు. రాజవంశీకుల వద్ద రత్నాలు కొని, అమ్మే వ్యాపారి రూథర్డ్. అతను నా అందానికి దాసోహమన్నాడు. నన్నమితంగా ప్రేమిం చాడు. అతను వివాహితుడని తెలిసి కూడా నేనతనితో పీకల లోతు ప్రేమలో కూరుకుపోయాను. అతను నా కళ్ళ వెలుగు ముందు నీలాలు వెలవెల బోతాయనేవాడు. నా పెదాల మెరుపు ముందు మేలుజాతి కెంపులు కూడా దిగదుడుపేనన్నాడు. నా పలువరుస ముందు మంచి ముత్యాలు చిన్నబోతాయని నవ్వేవాడు. మేం తొమ్మిదిసార్లు కలుసుకున్నాము. ప్రతీసారీ మా కలయికకు గుర్తుగా రూథర్డ్ నాకు ఒక్కొక్క విలువైన రత్నాన్ని కానుకగా ఇచ్చేవాడు. మా మధ్య రహస్య ప్రేమను కనిపెట్టిన రూథర్డ్ బావమరిది మా నాన్నగారితో "మీరు గోవా నుండి రాత్రికి రాత్రే పారిపోవాలి. లేకపోతే మీ కుటుంబాన్ని సమూ లంగా నాశనం చేస్తానని బెదిరించాడు. మేం ఆ రాత్రే ప్రయాణమై ఈ పట్టణం చేరుకున్నాం. ఇక్కడ వైస్రాయ్‌గా ఉన్న మా నాన్నగారి స్నేహితుడు మమ్మల్ని ఆదరించి ఉండడానికి వసతి కల్పించారు. నాన్నగారికి రాజోద్యోగం ఇప్పించారు. కొన్నాళ్ళకలాగో రూథర్డ్‌కి నా జాడ తెలిసింది. నన్ను గోవా రమ్మని కబురంపాడు. వాస్కోడగామా బీచ్‌లో ఫలానా రోజు నా కోసం ఎదురు చూస్తూ ఉంటానని తెలిపాడు. కానీ నాన్నగారి హఠాన్మరణం వల్ల నేనారోజు అక్కడికి చేరుకోలేక పోయాను. అందరూ అనుకుంటున్నట్లు నన్ను నా ప్రియుడు మోసం చేయలేదు. విధి నన్ను మోస గించింది. వాస్కోడగామా బీచ్‌లో నాకై ఎదురు చూస్తూ ఏమరుపాటుగా ఉన్న రూథర్డ్‌ని సముద్రపు అల కబళించింది. ఆ తర్వాత రూథర్డ్ కుటుంబీకులు ఇంగ్లండ్ వెళ్ళిపోయారు. కానీ ఎవరి ద్వారానో దశాబ్దాలుగా మరుగున పడిపోయిన మా ప్రేమ కథతో పాటు విలువైన నా ప్రేమ కానుక గురించీ తెలుసుకున్న రూథర్డ్ దూరపు బంధువుల అబ్బాయి జార్జ్ నా వద్దనున్న అమూల్యమైన ఆ రత్నాలను తనకివ్వమని వేధించసాగాడు. నా వద్ద ఎటువంటి రత్నాలూ లేవని బుకాయించాను. అతను నన్ను నమ్మలేదు. ఆ రత్నాలను తనకివ్వకపోతే నన్ను చంపేస్తానని బెదిరించాడు. అతనన్నంతపనీ చేయగల సమర్థుడని నాకు తెలుసు. ఒక అపాత్రుని చేతికి అపురూపమైన నా ప్రేమ చిహ్నాలను దక్కనివ్వవద్దను కున్నాను. ఈ సమయంలో వాటిని ఎవరికిచ్చినా జార్జ్ వల్ల వాళ్ళకు ప్రమాదం వాటిల్లుతుంది. నేను వాటిని చర్చ్‌కో, ప్రభుత్వానికో చేర్చేలోపల జార్జ్ వాటిని తస్కరించే అవకాశం ఉంది. సరి అయిన సమయం వచ్చేవరకూ ఈ రహస్యం నాలోనే ఉండాలి. జార్జ్ చివరగా నాకిచ్చిన నాలుగు రోజుల గడువు నేటితో పూర్తవుతుంది. నాకేం చేయాలో తోచటంలేదు. ఈ సమస్యను దైవ నిర్ణయానికి వదులుతున్నాను. రత్నాలతో పాటు ఈ ఉత్తరాన్ని కూడా ఇందులో పెట్టి పరిశుద్ధాత్మగల ఒక శిశువుకి ఈ రహస్యపు అర తాళం చెవి క్రిస్మస్ గిఫ్ట్‌గా ఇస్తున్నాను. ప్రభువు నాకు న్యాయం చెయ్యదలుచుకుంటే నేను ప్రాణ ప్రదంగా భావించే నా ఈ ప్రేమ చిహ్నాలు సరయిన వ్యక్తి చేతిలో పడతాయని విశ్వసిస్తూ..."

**-ఎలిజబెత్**

ఆ ఉత్తరం చదివిన వివేక్ పల్లవిలకు విషయం అర్థమయ్యింది.

❍ ❍ ❍

ఏడాది గడిచింది. పల్లవి ఆ విలువైన రత్నాలను చర్చ్ వాళ్లకు ఒప్పజెప్పింది. ఎలిజబెత్ ఇల్లును మ్యూజి యంలా మార్చారు. ఆమె వాడిన వస్తువులు విలువైన నవరత్నాలు అక్కడ ప్రదర్శింపబడుతూ ఆమె ప్రేమ కథను చిరస్మరణీయం చేస్తున్నాయి. పల్లవి ఎలీజా మేడమ్ ఇంటి నుండి ఆమెకు ప్రియాతి ప్రియమైన బ్లూబెల్ తీగె అం టును మాత్రం తీసుకెళ్ళి తనింట్లో నాటుకుంది. ఆమె ఇంటి కిటికీ ఊచలకు ఎగబాకి నిండుగా పూచిన బ్లూ బెల్స్ నిశ్శబ్దంగా గాలికి తలలూపుతూ ఉంటే ఎలీజా మేడమ్ పలకరిస్తున్నట్లుగా ఉంటుందామెకు. ■